ప్రజాశక్తి
గురువారం 27 మార్చి 2025

దెబ్బతిన్న వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

# టిడిపి, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ

## రామగిరి ఎంపిడిఒ కార్యాలయం వద్ద పరస్పర దాడులు
## 144సెక్షన్ విధించిన పోలీసులు

**ప్రజాశక్తి - రాప్తాడు**

శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపిడిఒ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి నాయకుల మధ్య సోమవారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సందర్భంగా పరస్పరం దాడులు చేసుకున్నారు. వైసిపి నాయకులకు చెందిన వాహనాలను టిడిపి నాయకులు ధ్వంసం చేశారు. వైసిపి నాయకులను ఎంపిడిఒ కార్యాలయంలో నిర్బంధించారు. ఈఘటనకు సంబందించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

రామగిరి ఎంపీపీ ఎన్నికకు సంబంధించి బి ఫాం అందజేసేందుకు వైసిపి నాయకులు ఎంపిడిఒ కార్యాలయానికి బుధవారం వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి చెందిన వాహనంలో లీగల్ సెల్ నాయకుడు న్యాయవాది కురుబ నాగిరెడ్డి, రాప్తాడు వైస్ ఎంపిపి బోయ రామాంజనేయులు, వాలంటరీ విభాగం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ముష్టి కోవెల హరినాథ్ రెడ్డి ముగ్గురు కలిసి బీఫామ్ అందజేసేందుకు రామగిరి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న టిడిపి నాయకులు వీరి వాహనంపై దాడి చేసి ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా బోయ రామాంజనేయులు, ముష్టికోవెల హరినాథరెడ్డిని కొట్టుకుంటూ ఎంపీడీవో కార్యాలయంలోకి తీసుకెళ్లి అక్కడ నిర్బంధించారు. బయట ఉన్న న్యాయవాది నాగిరెడ్డిపై కూడా దాడి చేసి ఎంపీడీవో కార్యాలయంలోకి లాక్కెళ్లి బంధించారు. ఈఘటనలతో రామగిరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరుపార్టీల నాయకులు రాడ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసం అయ్యాయి. వెంటనే స్పందించిన పోలీసులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరం డీఎస్పీ హేమంత్ అక్కడికి చేరుకున్నారు. వాహనాలను స్టేషన్‌కు తరలించారు. రామగిరి ఎంపిపి ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ ఆదేశాల మేరకు రామగిరిలో 144 సెక్షన్ విధించారు.

**పోలీసుల అదుపులో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి :** రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని సోమందేపల్లి పోలీసులు అదుపులో తీసుకున్నారు. రామగిరి ఎంపిడిఒ కార్యాలయం వద్ద టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవటంతో వైసిపి శ్రేణులకు మద్దతుగా వెళుతున్న ఆయనను జాతీయ రహదారిపై డీఎస్పీ వెంకటేశ్వర్లు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి వెళితే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని పోలీసులు ఆయనకు చెప్పారు.

**టీడీపీది పైశాచిక చర్య : వైసిపి**

**సోమందేపల్లి :** జిల్లాలో టిడిపి నాయకులు పైశాచిక చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. రామగిరిలో చోటు చేసుకున్న ఘర్షణ నేపథ్యంలో అక్కడికి వెళుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని పెనుకొండ డిఎస్పి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వై జంక్షన్లో అదుపులోకి తీసుకున్నారు. ఆయనను స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ వెంటనే స్టేషన్ కు చేరుకున్నారు. అక్కడ తోపుదుర్తి పరామర్శించి అనంతరం డిఎస్పితో మాట్లాడారు, ఏ తప్పు చేయని ప్రకాష్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రామగిరి ఎంపీపీ ఎంపికకు సంబంధించి గెజిట్ రావడంతో వాటిని పర్యవేక్షించడానికి బెంగళూరు నుండి రామగిరి వెళుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డినికావాలనే టీడీపీ పెద్దలు అరెస్ట్ చేయించారన్నారు. నియోజకవర్గంలో టిడిపి నాయకులు కావాలని రెచ్చగొట్టి దాడులు చేస్తున్నారన్నారు. రామగిరి మండలంలో టిడిపికి కేవలం ఒక ఎంపీటీసీ మాత్రమే ఉన్నారని, మిగిలిన ఎంపీటీసీలు తమ వైపు ఉన్న ఓడిపోతామని తెలిసినా కావాలని రెచ్చగొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి ఎంపీపీ మహిళలకు రిజర్వేషన్ అయిందని, మహిళా ఎంపీటీసీలు అంతా తమ పక్కన ఉంటే అటువైపు ఎవరు లేకున్నా ఎలా వారికి ఎంపీపీ పదవి దక్కుతుందో అర్థం కావడం లేదన్నారు. ప్రశాంతంగా జరగాలని తాము అనుకొంటున్నా కావాలనే రెచ్చగొడుతూ దాడులు చేస్తూ తమపై కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారన్నారు. గెలవలేమని తెలిసినా దాడులు, దౌర్జన్యాలు చేస్తూ పైసాచిక ఆనందం పొందుతున్నారన్నారు. జిల్లాలోని ఇద్దరు మంత్రులు ఇలాంటి వాటిని నియంత్రించాల్సింది పోయి రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. జడ్పీటీసీ డీసి అశోక్ కుమార్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు రమకాంతరెడ్డి, ఇమామ్ వలి, నరసింహామూర్తి, సూర్యప్రతాప్ రెడ్డి, రామాంజినేయులు, మంజునాథ్, నవకోటి శివ, నాగరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీఎస్పీతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

# అభివృద్ధిలో 'శ్రీసత్యసాయి' టాప్

## ద్వితీయ స్థానంలో 'అనంత'
## జిల్లాల అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్షలో చర్చ

విజయవాడలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

రాయలసీమలోని ఐదు జిల్లాల జోన్ పరిధిలో అభివృద్ధిలో శ్రీసత్యసాయి జిల్లా టాప్‌లో ఉండగా, అనంతపురం జిల్లా రెండవ స్థానంలో ఉంది. జిల్లాల ప్రగతిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రెండు రోజులుగా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. రెండవ రోజు అయిన బుధవారం నాడు జిల్లా పురోగతిపై అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు డాక్టర్ వినోద్‌కుమార్, చేతన్ తమతమ జిల్లాల ప్రగతిని వివరించారు. ఐదేళ్ల అభివృద్ధి ప్రణాళికల గురించి వివరించారు. అనంతపురం జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవన పంటలతోపాటు, టూరిజంపైనా ప్రధానంగా పోకస్ చేస్తున్నట్టు కలెక్టరు వినోద్‌కుమార్ వివరించారు. మూడు క్లస్టర్లు, మూడు సర్క్యూట్‌లు రూపొందించినట్లు చెప్పారు. అదే విధంగా హంద్రీనీవా వైడనింగు గురించి ప్రస్తావించారు. ఎంఎస్ఎంఇల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సత్యసాయి జిల్లా కలెక్టరు చేతన్ సత్యసాయి జిల్లా అభివృద్ధికి ఉన్న అవకాశాల గురించి వివరించారు. ఎగువ ప్రాంతంలో సత్యసాయి జిల్లా ఉండటంతో వర్షపాతం పడిన తరువాత జలాలు చిత్రావతి, పెన్నా నదిలో చేరాయన్నారు. అనంతరం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అనంతపురం, శ్రీసత్యసాయి, నంద్యాల, కర్నూలు, కడప జిల్లాల జోన్ గురించి వివరించారు. ఈ జోన్‌లో శ్రీసత్యసాయి జిల్లా అగ్రగామిగా ఉందని తెలిపారు. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం రూ.311004 అయితే 12.202 శాతం పురోగతి ఉందని శ్రీసత్యసాయి జిల్లా పురోగతి రూ.314751 ఉందని చెప్పారు. 13.57 శాతం అభివృద్ధి చెందిందని చెప్పారు. రాష్ట్ర సగటు కంటే అధికంగా ఈ జిల్లా సగటు ఉందని అన్నారు. ఈ జోన్‌లో చూసినప్పుడు ఈ జిల్లానే టాప్‌లో ఉందని చెప్పారు. ఆ తరువాతి స్థానం అనంతపురం జిల్లా ఉందన్నారు. ఈ జిల్లా రూ.304223 తలసరి ఆదాయం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. అభివృద్ధి సగటు 12.01శాతమన్నారు. రాష్ట్ర సగటు కంటే తక్కువగానే ఉన్నప్పటికీ జోన్‌లో రెండవ స్థానంలో అనంతపురం జిల్లా ఉందని పేర్కొన్నారు. అనంతపురం, సత్యసాయి జిల్లాలకు ఆనుకుని బెంగళూరు ఎయిర్‌పోర్టు ఉండటంతోపాటు కియా పరిశ్రమ వచ్చాక ఈ ప్రాంతాభివృద్ధికి అవకాశాలు మరింత ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటితోపాటు హంద్రీనీవా ఈ ప్రాంతంలో గేమ్ ఛేంజర్ కానుందన్నారు. దీన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు ఇప్పటికే తీసుకుంటున్నట్లు వివరించారు. ఉద్యానవన పంటలను, పశుపోషణను ప్రోత్సహించాల్సిన అవసరముందని కూడా తెలిపారు. నిర్ణయించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతీల వరకు కూడా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు.

## ఎపి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక
## ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా శ్రీనివాసులు

**ప్రజాశక్తి-హిందూపురం**

ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా హిందూపురం పట్టణానికి చెందిన శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతు వేదిక జిల్లా అధ్యక్షులుగా గంటల నారాయణ రెడ్డిని ఎంపిక చేశారన్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు వెంటనే ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే కలువలను వెడల్పు చేస్తే దిగువ ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికి సాధ్యమవుతుందన్నారు. అకాల వర్షాల వల్ల పండ్ల తోటల రైతులు అధికంగా నష్ట పోయారని వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా సమగ్రాభివృద్ధికై అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకొని ముందుకు వెళ్లాలని నిర్ణయించామన్నారు.

# అర్ధాంతరంగా ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు

పునాదికే పరిమితమైన భవన నిర్మాణపనులు

అర్థాంతరంగా ఆగిన భవన నిర్మాణపనులు

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

కొత్తచెరువులో పలు ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. పలు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గతంలో కొత్తచెరువు జూనియర్ కళాశాల మైదానం లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరు కావడంతో 2018లో పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించారు. అప్పటి ఎమ్మెల్యే పల్లె రఘునాథ్ రెడ్డి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. 2019 వరకు అరకొరగా నిధులు మంజూరు కావడంతో పునాదులు వేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణం పనులు ఆగిపోయాయి. దీంతో అది పునాదులకే పరిమితమైంది. ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయితే విద్యార్థులు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అలాగే బీసీ బాలికల వసతిగృహం అద్దె భవనంలో కొనసాగిస్తున్నందున విద్యార్థినుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 2014 సంవత్సరంలో ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలో నల్లకొండ వద్ద ఉన్న స్థలంలో వసతిగృహ నిర్మాణానికి రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఆ పనులను కాంట్రాక్టర్లు వేగవంతంగా నిర్వహించి రెండంతస్తుల భవన నిర్మాణ గదుల పనులు పూర్తి చేశారు. అయితే ఇంకా పనులు చేయాల్సి ఉంది. అప్పటినుంచి నిధులు మంజూరు కాకపోవడంతో పనులను ఆపేశారు. ప్రహరీ, మరుగుదొడ్లు, కిటికీలు, వాకిళ్లఏర్పాటు చేయాల్సి ఉంది. బిల్లులు కాకపోవడంతో అలాగే వదిలేయడంతో ఆ అసంపూర్తిగా ఉన్న భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. బాలుర ఉన్నత పాఠశాల వెనుక భాగం లో అదునపు గదులు నిర్మాణానికి 2020 సంవత్సరంలో రూ. 1.19 కోటు నేడు పథకం కింద నాబార్డు నిధులు మంజూరయ్యాయి. రెండంతస్తుల భవనంలో 8 గదులు నిర్మించారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీనితో నిరుపయోగంగా ఆ పాఠశాల గదులు ఉంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# వ్యాపారులు నిర్ణయించిందే ధర..

## అధిక ధరలతో బేంబేలెత్తున్న వినియోగదారులు
## పట్టించుకోని అధికారులు
## పండుగ పూట ఏవీ కొనలేకపోతున్న జనం

**ప్రజాశక్తి-హిందూపురం**

**పండుగ అని సుభాన్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి తన మూడు సంవత్సరాల కూతురుకు డ్రస్ కొనుగోలు చేయాలని హిందూపురం పట్టణంలోని ముక్కడిపేటలో గల ఒక వస్త్ర దుకాణానికి వెళ్లాడు. కనీసం రూ.600 విలువ కూడా పలకని ఒక గౌను రూ.2,500 అని వ్యాపారి చెప్పడంతో ఆర్థిక స్థోమత లేకా వెనక్కి వచ్చాడు.**

**దిన కూలి చేసుకుంటు జీవనం సాగిస్తున్న నూరూల్లా తన 15 సంవత్సరాల కూతురుకి ఒక డ్రెస్ కొనడానికి వెళ్లాడు. రూ.800 విలువ చేయని ఆ డ్రస్ రూ.4వేలు అని వ్యాపారి చెప్పడంతో అతను ఒక్క సారిగా ఖంగుతిన్నాడు.**

**పట్టణంలో నివాసం ఉంటున్న రమేష్ తన కూతురు కోసం ఒక డ్రెస్ కొనడానికి బట్టల దుకాణానికి వెళ్లాడు. కనీసం రూ.700 విలువ చేయని ఆ డ్రెస్ రూ.3వేలు అని చెప్పడంతో కొనే స్థోమత లేక వెనక్కి వచ్చాడు.**

**ఇలా ఒక్క సుభాన్, నూరూల్లా, రమేష్ లే కాదు ఎంతో మంది దినసరి కూలీలు, మెకానిక్ పని ఇతర వృత్తులు చేసుకోనే వారు పడుతున్న భాదలు ఇవి...**

రెండు సామాజిక వర్గాలకు చెందిన ఉగాది, రంజాన్ పండుగలు ఒకే సారి రావడంతో వారి స్థాయికి తగ్గట్లు వచ్చిన ఆదాయంతోనే పండుగను సందడిగా చేసుకుంటారు. ముఖ్యంగా మన ప్రాంతాల్లో హిందు సోదరులకు ఉగాది, ముస్లీం సోదరులకు రంజాన్ పండుగలు పెద్ద పండుగలు. ఈ పండుగల్లో కూలీ నాలీ చేసుకుని జీవనం సాగించే వారు సైతం వారికి లేకున్నా తమ బిడ్డలకు అయిన నూతన వస్త్రాలను కొని ఇవ్వాలనుకుంటారు. అయితే వస్త్ర దుకాణాల్లో బట్టల కోసం వెళ్లి ధరలు అడిగి దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. వ్యాపారులు నిర్ణయించే ధరగా మారింది. ఆ వస్త్రాలపై తయారీదారులు నిర్ణయించిన ధర ఉండదు. వ్యాపారులు నిర్ణయించిన ధరలు ఉంటాయి. ఎవరైన నిర్ణీత ధరలు లేవని అడిగితే ఇష్టం ఉంటే తీసుకోండి....లేదా వెళ్లండి అంటూ వ్యాపారులు సమాధానమిస్తున్నారు. వారికి ఎదురు చెప్పలేక ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వ్యాపారులు చెప్పిన ధరలకే వినియోగదారులు కొంటున్నారు. వ్యాపారులు వారికి ఇష్టం వచ్చిన ధరలను నిర్ణయించి వ్యాపారాలు చేస్తున్నారు. వినియోగదారులు కొన్న వాటికి వ్యాపారులు బిల్లులు సైతం ఇవ్వడం లేదు. మొత్తం అంతా జీరో వ్యాపారమే. ఒక్క ముక్కడిపేటలోనే రంజాన్ నెలలో కనీసం రూ.3 కోట్లకు పైగా వ్యాపారాలు జరుగుతుంటాయి. ఇక మొత్తం పట్టణంలో ఉన్నా వస్త్ర దుకాణాల్లో పరిశీలన చేస్తే ఇది దాదాపు రూ.5 నుంచి 8 కోట్ల రూపాయలకు పైగా వ్యాపారం జరుగుతుంది. ప్రతి దుకాణం రోజుకు రూ.లక్షల వ్యాపారాలు చేస్తున్నప్పటికి వారికి బిల్లు బుక్‌లు సైతం ఉండవు. ఇంత పెద్ద ఎత్తున జీరో వ్యాపారాలు జరుగుతున్నా కూత వేటు దూరంలో ఉన్న వాణిజ్య శాఖ అధికారులు అటు వైపు చూడడం లేదు.

పట్టణంలోని ముక్కడిపేటలో వెలసిన బట్టల దుకాణాలు

**ఆ రెండు శాఖలే కీలకం**

వస్త్ర దుకాణాలతో పాటు ప్రతి వ్యాపారాల్లోనూ ప్రధానంగా తూనికలు కొలతల శాఖ, వాణిజ్య శాఖ అధికారులే కీలకం. ఇందులో తూనికలు కొలత శాఖ అధికారులు వస్త్ర దుకాణాలతో పాటు ఇతర దుకాణాలను తనఖీ చేసి, నిర్ణీత ధరలకు విక్రయిస్తున్నారా.? లేదా అని పరిశీలించవచ్చు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయవచ్చు. అయితే ఇప్పటి వరకు ఇటువంటి కేసులు అధికారులు నమోదు చేయ లేదు. కేవలం దీపావళి పండుగ సమయంలో మాత్రం ఎంజిఎం మైదానంలో తూనికల కొలతల శాఖ అధికారి కనిపించి, రెండు నుంచి మూడు దుకాణాలను తనిఖీ చేసి, వారిపై కేసు నమోదు చేసి వెళ్లిపోతుంటారు. ఆధారాలతో ఫిర్యాదులు చేస్తున్నప్పటికి ఏ మాత్రం పట్టించు కోవడం లేదు. అసలు తూనికల కొలతల శాఖ అధికారులు ఉన్నారా...? లేదా అనేది ఎవరికి తెలియడం లేదు. ఈ శాఖ ఇలా ఉంటే వాణిజ్య శాఖ అధికారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లులు తీసుకోవాలని వినియోగదారులకు మాత్రమే చెబుతారు. బిల్లులు ఇవ్వని దుకణాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోరు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే జిఎస్‌టి ఉంది వ్యాపారులు కొనుగోలు సమయంలోనే పన్ను చెల్లిస్తారని అంటున్నారు. అయితే జిఎస్‌టితో ఎంత కొనుగోలు చేశారు. జిఎస్‌టి లేకా ఎంత కొనుగోలు చేశారు అన్నది మాత్రం చూడడం లేదు. ఈ రెండు శాఖల నిర్లక్ష్యానికి వినియోగదారులు బలి అవుతున్నారు. ఇప్పటికైన ఈ శాఖలు మామూళ్ల మత్తులో నుంచి బయటకు వచ్చి తనఖీలు ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

# జిల్లాలో జరిగే ఎంపీపీ ఎన్నికలు సజావుగా నిర్వహించండి

## వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

జెసికి వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో గురువారం జరిగే ఎంపీపీ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో సజావుగా నిర్వహించాలని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీ చరణ్ కోరారు. ఈ మేరకు ఆమెతోపాటు వైసిపి నాయకులు కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ జిల్లాలోని గాండ్లపెంట, రామగిరి, రొద్దం మండలాల ప్రజా పరిషత్ అధ్యక్షుల ఎన్నికలు గురువారం జరగనున్నాయన్నారు. ఈ ఎన్నికలలో అధికార పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రలోభాలు, దౌర్జన్యాలు జరగకుండా చూడాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్‌ను కోరామన్నారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్, ఆ పార్టీ నాయకులు డిసి అశోక్ కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోండి

## మున్సిపల్ ఛైర్మన్‌ను కోరిన కౌన్సిలర్లు

**ప్రజాశక్తి-హిందూపురం**

తమ వార్డుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘంలో పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ సంగం శ్రీనివాసులును కోరారు. ఈ మేరకు వారు తమ వార్డుల్లో నెలకొన్న నీటి సమస్యను వివరించారు. సమస్యను పరిష్కరించక పోతే తాము వార్డుల్లో తిరగలేమని చెప్పారు. స్పందించిన ఛైర్మన్, కమిషనర్ నీటి సరఫరా విభాగ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వేసవిలో ఎక్కడా నీటి ఎత్తడి తలెత్తకుండా చూసుకోవడానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామన్నారు. పట్టణంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎఇ జనార్ధన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**నీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచుతాం :** గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం పట్టణానికి వస్తున్న నీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కొల్లకుంట వద్ద ఉన్న నీటి పంపిణీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ప్రతిరోజు 9 నుంచి 10 ఎం ఎల్ డి నీటి సరఫరా అవుతుందని అధికారులు తెలిపారు. దీనిని మరింత పెంచటానికి సాధ్యసాధ్యాలపై చర్చించారు. రోజుకు 15 ఎం ఎల్ డి నీటి సరఫరా జరిగితే పట్టణంలో నీటి సమస్య ఉండదన్నారు.

మున్సిపల్ ఛైర్మన్, క మిషనర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

**విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన :** హిందూపురం పురపాలక సంఘం పరిధిలో 35వ వార్డు నందు భాగ్యనగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అనువైన స్థల పరిశీలన కోసం మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ బుధవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేసేందుకు సర్వే చేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మద్దన జయరాములు, టిడిపి నాయకులు నాగేంద్ర, హరీష్, చంద్ర, వెంకటస్వామి, నూర్ బాషా, మూర్తి, మక్బూల్ బాషా సచివాలయం సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని గుర్తు చేశారు. వైసిపి హయాంలో ఆర్థిక విధ్వంసం జరగడం వల్ల ప్రస్తుతం రాష్ట్రం లోటు బడ్జెట్‌తో ముందుకు సాగుతుందని తెలిపారు. సిఎం చంద్రబాబు పరిపాలనాదక్షుడు కావడం వల్ల రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని 195 చెరువులను హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, హెల్త్, పోలీస్, ఇరిగేషన్, వ్యవసాయ, హార్టికల్చర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**పట్టాలు మంజూరు చేయాలని రైతుల వినతి**

**పుట్టపర్తి క్రైమ్ :** 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాలు మంజూరు చేసి పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని వీరాంజనేయపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే సింధూరకు వినతిపత్రం ఇచ్చారు. వైసిపి హయాంలో లేనిపోని రాజకీయాలు చేసి తమకు అన్యాయం చేశారని వాపోయారు. వినతి ఇచ్చిన వారిలో రైతులు సతీష్‌బాబు, శ్రీనివాసులు, నారాయణస్వామి, మల్లికార్జున, రత్నశేఖర్, మహేంద్ర, అశోక్ ఉన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

**ఘనంగా ఇఫ్తార్ వేడుకలు**

స్థానిక ఎనుములపల్లి గణేష్ సర్కిల్‌లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం షాదీ మహల్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలు సాయంత్రం ఉపవాస దీక్షను విరమింపజేసి ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకల్లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ విజయసారథి, ఆర్‌డిఒ సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్, మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, సయ్యద్, అబ్దుల్, రఫీ, అల్లా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ భారాలపై రేపు సిపిఎం ధర్నా

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28వ తేదీ జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాలను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.ఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన 'ప్రజలకు విద్యుత్ షాక్‌లు' బుక్‌లెట్‌ను బుధవారం పట్టణంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ ట్రూ అప్ ఛార్జీలు, ఎలక్ట్రిక్ డ్యూటీ పేరుతో ప్రజలపై మోపిన భారాలను తగ్గించే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై ఛార్జీల పేరుతో రూ. 17 వేల కోట్ల భారం మోపడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అదానీతో చేసుకున్న ఒప్పందాల వల్ల రైతులు, పేదలపై భారీ స్థాయిలో విద్యుత్ భారం పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం మోపడం సరైంది కాదన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యల్ల అంజి, కొత్తచెరువు మండల కార్యదర్శి ముత్యాలు, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి వెంకటేష్, పార్టీ సభ్యులు రమాదేవి, మంజుల, బాషా పాల్గొన్నారు.

**కదిరి అర్బన్ :** పట్టణంలోని కళ్లంగిడి వీధిలో ఉన్న సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు ఆధ్వర్యంలో 'విద్యుత్ షాక్‌లు' పుస్తకాన్ని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలు మోపారన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్ర ప్రజలపై మాత్రం విద్యుత్ భారాలు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబ్‌జాన్, రామ్మోహన్, ముస్తాక్, రఫీ, రామంజి, సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో 'విద్యుత్ షాక్‌లు' బుక్‌లెట్ విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

**ఓబుళదేవరచెరువు :** స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో 'విద్యుత్ షాకులు' పుస్తకాన్ని విడుదల చేసారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు రమణ మాట్లాడుతూ వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం తగదన్నారు. వెంటనే ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు, స్మార్ట్ మీటర్లు, సెకి ఒప్పందాలు రద్దు చేయాలని లేకపోతే ప్రజలను చైతన్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రామంజి, అంజి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

పట్టణంలో పేదలు నివాసం ఉంటున్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఎం నాయ కులు ఎస్‌హెచ్.బాషా, జెవి.రమణ, టి.అయాబ్‌ఖాన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీల్లో నేటికీ మౌలిక సదుపాయాలు లేవంటే ప్రజాప్రతినిధులు, అధికారులు పనితీరు ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. ప్రధానంగా ఎల్‌సికె పురం, ఎంజి కాలనీ, రాజశేఖర్‌రెడ్డి కాలనీ, ఎల్-1, 2, 3, 4, తదితర వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్, రోడ్లు లేవన్నారు. తాగునీటి సమస్యపై ఆయా కాలనీవాసులు ఆందోళనలు చేపట్టినా పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కాలనీల్లో తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారి వెంట ఎస్. హైదర్‌వలి, బత్తల కదిరప్ప, జి.హరి, వెంకటస్వామి, ఎ.ఖాదర్‌బాషా, రెడ్డప్ప, పాల్గొన్నారు.

కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

## ఉద్యోగుల సమస్యలపై 2న ధర్నా : ఫ్యాప్టో

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఏప్రిల్ 2వ తేదీ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు మల్లు రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్‌లో బుధవారం ఛైర్మన్ కె.శ్రీనివాసులు అధ్యక్షతన ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రఘునాథరెడ్డి మాట్లాడుతు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. 12వ పిఆర్‌సి, ఐఆర్ 30 శాతం ప్రకటించాలన్నారు. పెండింగ్ డిఎలు మంజూరు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి, పర్యవేక్షణ అధికారి పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు ఎస్.జయచంద్రారెడ్డి, ఆర్.చంద్ర, ఎం.సుధాకర్, జి.హరిప్రసాద్‌రెడ్డి, కె.చంద్రశేఖర్, బి.హరిప్రసాద్‌రెడ్డి, కె.గౌస్‌లాజం, లక్ష్మీనారాయణ, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన ఫ్యాప్టో నాయకులు

## మంత్రి చొరవతో విద్యుత్ సౌకర్యం

**ప్రజాశక్తి-పెనుకొండ**

మంత్రి సవిత చొరవతో పట్టణంలోని ఉప్పరవాడకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. పట్టణంలోని దర్గాపేట, ఉప్పరవాడ కాలనీలు ఏర్పడి 15 ఏళ్లయినా విద్యుత్ సౌకర్యం లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆమె వారి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్లు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం ప్లాంట్ ఏర్పాటు చేశారు. దర్గా వెనుక ఉన్న బోర్‌వెల్ మోటార్, బోరు పైపులను కొందరు వ్యక్తులు తొలగించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వీరి సమస్యను టిడిపి నాయకులు మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే మోటార్, పైపులు ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, త్రివేంద్ర, వలీపీరా, ఇక్బాల్, నన్ను, బర్కత్, నజీర్, బోయనంజుండ, కురుబ నంజుండ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, సోము పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

## ఎంఇఒపై డిఇఒకు ఫిర్యాదు

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

నిబంధనలకు విరుద్ధంగా సింగల్ టీచర్‌ను పదో తరగతి ఇన్విజిలేషన్ విధులకు పంపిన ఎంఇఒపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ బుధవారం డిఇఒ జి.కృష్ణప్పకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కదిరి మండలంలోని నడింపల్లి పాఠశాలలో ఉన్న ఒకే ఒక ఉపాధ్యాయుడిని పదో తరగతి పరీక్షలకు ఇన్విజిలే టర్‌గా నియమించి, తిరిగి ఆ పాఠశాలకు మరొక ఉపాధ్యాయుని డిప్యుటేషన్ కింద నియమించారని, నిబంధనలు ఉల్లంఘించిన ఎంఇఒపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కె.భూతన్న, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, తాహిర్‌వలి, శివశంకర్, నారాయణస్వామి, నరేష్‌కుమార్, క్రిష్టప్ప, బాబయ్య, బాబావలి, సాలప్ప, రవీందర్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

డిఇఒ కృష్ణప్పకు వినతి ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

## ప్రభుత్వాసుపత్రిలో 'సదరం' క్యాంప్

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

శరీర భాగాల పనితీరు, శరీర శక్తిని తెలుసుకోవడమే సదరం క్యాంప్ ముఖ్య ఉద్దేశ్యమని క్యాంప్ డాక్టర్ చందన తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆమె 46 మందిని పరీక్షించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి బుధ, గురు, శుక్రవారాల్లో సదరం క్యాంప్ ఉంటుందన్నారు. ముందుగా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే రోగికి మెసేజ్ వస్తుందన్నారు.

సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డాక్టర్ చందన

## ఎల్-4 కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు

**ప్రజాశక్తి కథనానికి స్పందన**

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

పట్టణంలోని ఎల్-4 కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ఎల్-4 కాలనీలో నీటి ఎద్దడిపై ఇటీవల ప్రజాశక్తి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి కె.హరీశ్‌బాబు బుధవారం ఎల్-4 కాలనీకి వెళ్లి బోరు పనులను ప్రారంభించారు. కె.హరీశ్‌బాబు మాట్లాడుతూ 28వ వార్డు పరిధిలోని ఎల్-4 కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు వేయించామని తెలిపారు. భవిష్యత్తులో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రాజ్‌ప్రకాష్, చిలకల సుధాకర్, శ్రీరాములు, బిజెపి నాయకులు పూలకుంట మహేష్, శ్రీరాములు, పవన్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, నాగమణి, సరస్వతి, నరసింహులు, ఆదిరెడ్డి, రమేష్, పాల్గొన్నారు.


ఎల్-4 కాలనీలో తాగునీటి బోరు వేయిస్తున్న నాయకులు

## ఉప ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : ఎస్పీ

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

జిల్లాలో పలు చోట్ల నిర్వహించే ఉప ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ వి.రత్న ఆదేశించారు. ఎస్పీ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో జిల్లాలో 3 ఎంపిపిలు, 2 ఉపసర్పంచి స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేం దుకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు సిద్ధం చేసిందన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. రామగిరి, రొద్దం, గాండ్లపెంట ఎంపిపి స్థానాలు, పెనుకొండ నియోజకవర్గంలోని రాంపురం, మడకశిర నియోజకవర్గంలోని కళ్లుమర్రి ఉపసర్పంచి స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికల సమయంలో 30 యాక్ట్, 144 సెక్షన్ ఆంక్షలు అమలు చేస్తామన్నారు. నిరంతరం సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఎస్పీ కోరారు.

## 'పది' పరీక్షలకు 227 మంది గైర్హాజరు : డిఇఒ

**ప్రజాశక్తి- కొత్తచెరువు**

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా 104 కేంద్రాల్లో ఫిజికల్ సైన్స్ పరీక్ష నిర్వహించారు. మొత్తం 21,743 మందికి గాను 21,516 మంది హాజరు కాగా 227 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డిఇఒ జి.కృష్ణప్ప తెలిపారు. ప్రయివేట్ విద్యార్థులు 212 మందికి 187 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 69 మందికి గాను 491 మంది హాజరుకాగా 118 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను విద్యాశాఖ అధికారులు తనిఖీ చేశారు.

మాట్లాడుతున్న ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున

## బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

బాల్య వివాహాలను నిర్మూలిద్దామని మడకశిర ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ మల్లికార్జున సూచించారు. మండలంలోని టేకులోడు మహాత్మ జ్యోతిరావు పూలే ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్డీటీ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ శోభారాణి అధ్యక్షతన 'బాలికలను చదివిద్దాం.. బాలికలను రక్షిద్దాం' కార్యక్రమం చేపట్టారు. మల్లికార్జున మాట్లాడుతూ చిలమత్తూరును బాల్యవివాహాల రహిత మండలంగా తీర్చిదిద్దడానికి ఆర్డీటీ కృషి చేస్తుందన్నారు. ఎంఇఒ సాల్మన్‌రాజు మాట్లాడుతూ బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలలు కూడా తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఉద్యోగులు ఆదినారాయణ, జయచంద్రారెడ్డి, చెన్నారెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్దాపుర గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీదేవి

**ప్రజాశక్తి-పావగడ**

తాలూకాలోని వైఎన్ హొసకోట్ హోబలి పరిధిలోని సిద్దాపుర గ్రామ పంచాయతీకి బుధవారం నిర్వహించిన ఉపాధ్యక్ష ఎన్నికల్లో లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉపాధ్యక్షుడిగా ఉన్న మారుతిప్రసాద్ రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి లక్ష్మీదేవి మాత్రమే దరఖాస్తు చేసుకోగా ఎన్నికల అధికారి అయిన తహశీల్దార్ వరదరాజు లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి, పంచాయతీ అభివృద్ధికి పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంగోత్రి రమేష్, సభ్యులు తిమ్మప్ప, మునిస్వామి, నాగన్న, శ్రీనివాస్, ఓబుళపతి, ఈరప్ప, రూపకిషోర్, గంగమ్మ, పంచాయతీ అభివృద్ధి అధికారి జయన్న, కాంగ్రెస్ నాయకులు ఈరారెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై రేపు సదస్సు

**ప్రజాశక్తి-గోరంట్ల**

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈ నెల 28వ తేదీ విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో సమాచార స్టిక్కర్స్ విడుదల చేసారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ క్లైమ్‌లకు నగదు చెల్లించాలన్నారు. నిర్మాణ రంగంలో వాడే ముడిసరుకుల ధరలు తగ్గించాలని, ఇతర న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, మండల అధ్యక్షులు ముద్దల వెంకటరమణ, కార్యదర్శి బాబ్‌జాన్, కోశాధికారి మహబూబ్‌బాషా, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డిఎంహెచ్‌ఒ

**ప్రజాశక్తి-నంబులపూలకుంట**

వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఎం హెచ్‌ఒ డాక్టర్ ఫైరోజ్‌బేగం హెచ్చరించారు. ఆమె బుధవారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించి ప్రసూతి భవనం, రక్త నమూనా కేంద్రం, మందుల గదులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వైద్యాధికారి, సిబ్బంది మధ్య సమన్వయలోపం వల్ల రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఇకపై వైద్యులు, సిబ్బంది ప్రతి రోజూ సమయ పాలన పాటించాలని, పనివేళల్లో రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట మలేరియా నివారణ అధికారి లక్ష్మీనాయక్, ఖలందర్, ఎస్‌ఒ రామలక్ష్మి, సిసి బాబాఫకృద్దీన్, వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, సూపర్వైజర్ శాంతమ్మ, మహేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

**గాండ్లపెంట :** స్థానిక పిహెచ్‌సిని డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఫైరోజ్‌బేగం సందర్శించారు. ఆమె మందులు, కాన్పుల గదులను పరిశీలించారు. చిన్నపిల్లల టీకాలు, హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. పని వేళల్లో ఆసుపత్రిలో అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆమె వెంట పిహెచ్‌సి వైద్యాధికారి మహేశ్వరి మారుతి, మలేరియా నివారణ అధికారి లక్ష్మీనాయక్, ఖలందర్, ఎస్‌ఒ రామలక్ష్మి, సిసి బాబాఫకృద్దీన్, క్యాంప్ ఆఫీసర్ బాలాజీ నాయక్, సూపర్వైజర్ ఉపేంద్రరెడ్డి, ఫార్మసీ సిబ్బంది ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.


తనకల్లు పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్‌ఒ

**తనకల్లు :** మండలంలోని కొక్కంటి పిహెచ్‌సిని డిఎంహెచ్‌ఒ ఫైరోజ్ బేగం తనిఖీ చేశారు. ఆమె వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్, కాన్పులగది, ల్యాబ్, ఫార్మసీ, చిన్నపిల్లల వ్యాక్సినేషన్ గదులను పరిశీలించారు. దినసరి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా ఉండేలా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఆమె వెంట పిహెచ్‌సి వైద్యాధికారి ధర్మరాజు, ఎంపిహెచ్‌ఎ ఓబులేసు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది ఉన్నారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు : ఆర్‌డిఒ

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ పంపిణీ చేయాలని, వాటర్ బాటిల్, డ్రమ్ములకు పెట్రోల్, డీజిల్ పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో మహేష్, డిఎస్‌ఒ వంశీకృష్ణారెడ్డి హెచ్చరించారు. వారు బుధవారం పట్టణంలోని దుర్గమ్మ గుడి వెనుక ఉన్న భారత్ పెట్రోల్ బంకును తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి రోజు వారి వివరాలను రిజిస్టర్‌లో రాయడం లేదని, తాగునీరు ఏర్పాటు చేయ లేదని, గాలి పంపు లేదని, అగ్నిమాపక పరికరాలు మూలన పెట్టడం గుర్తించారు. అలాగే మరుగు దొడ్లు అపరిశుభ్రంగా ఉండటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై రిజిస్టర్‌లో వివరాలు తప్పని సరిగా రాయాలని, ఉచితంగా తాగునీరు, గాలి, టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్ కొలతలను పరిశీలించారు. వారి వెంట డిటి సురేష్ బాబు, సిఎస్‌డిటి సురేంద్రనాథ్ ఉన్నారు.

పెట్రోల్ బంకును తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ, డిఎస్‌ఒ

**ప్రభుత్వ భూములను సంరక్షిస్తాం : ఆర్డీవో**

**ధర్మవరం టౌన్ :** రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ భూములను సంరక్షించడం మా బాధ్యత అని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు ఎప్పటికప్పుడు భూముల ఆక్రమణలపై సమాచారం సేకరిస్తూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటాయని తెలిపారు. భూముల రక్షణకు సమగ్ర ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణలో ప్రజలు భాగస్వాములై భూములు ఆక్రమణకు గురైతే వెంటనే కమిటీలకు సమాచారం ఇవ్వాలన్నారు.

## ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన

**ప్రజాశక్తి-రొద్దం**

స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ శిక్షణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ సంఘాల లీడర్లు, విఒ యానిమేటర్లకు ఖరీఫ్ వార్షిక ప్రణాళికపై వ్యవసాయ శాఖ, వెలుగు, సెరికల్చర్ శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారున. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించిన రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ పద్మావతి, వ్యవసాయ అధికారి నివేదిత, వెలుగు ఎపిఎం విశ్వనాథ్, ఏపీ సీడ్స్ సిబ్బంది ఎన్‌ఎఫ్‌ఎ సాకప్ప, మండల ఇన్‌ఛార్జి భార్గవ్, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సంఘాల లీడర్లు

## ఆర్టీసీ జోనల్ ఛైర్మన్‌ను కలిసిన సత్యశేఖర్

**ప్రజాశక్తి-రొద్దం**

ఎపిఎస్‌ఆర్టీసీ కడప జోనల్ ఛైర్మన్ వాల్మీకి పూల నాగరాజును బుధవారం మండల యువ నాయకుడు ఆర్.మరవపల్లి సత్యశేఖర్ అనంతపురంలోని ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. సత్యశేఖర్ పూల నాగరాజుకు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బాబు, రఫిక్‌బాషా ఉన్నారు.


పూల నాగరాజును కలిసిన సత్యశేఖర్

## నారాయణ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

గోరంట్ల పట్టణంలోని నారాయణ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పైపల్లి గంగాధర్, శ్రీనివాస్ నాయక్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అనుమతి లేకపోయినా వసతి గృహం నిర్వహించడంతో పాటు సెలవు రోజుల్లో, సమయపాలన లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని, బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్నారనా, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ బిల్డింగ్‌లో పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. ఇవన్నీ తెలిసిన మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు.

## ఈకేవైసీ వేగవంతం చేయండి : సిఎస్‌డిటి

**ప్రజాశక్తి-అమడుగూరు**

మండలంలోని రేషన్ డీలర్లు ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేయాలని సిఎస్‌డిటి రమాదేవి ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ నెలాఖరులోపు పూర్తి చేయకపోతే కార్డు లబ్ధిదారులకు ఏప్రిల్ నెల నుంచి రేషన్ వస్తుందో రాదో కూడా తెలియదన్నారు. కావున డీలర్లు కార్డుదారులకు అందుబాటులో ఉండి ఈకేవైసీ చేయించాలన్నారు. అక్కడ వేలిముద్ర పడని వారు సంబంధిత సచివాలయంలో అప్డేట్ చేసుకోవాలని సిఎస్‌డిటి సూచించారు.

## ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి

**ప్రజాశక్తి-పావగడ**

ట్రాక్టర్ ఢీకొని బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం తాలూకాలోని తిమ్మమ్మనహళ్లి గ్రామంలో జరిగింది. తాలూకాలోని చిక్కజాలోడు గ్రామానికి చెందిన వరుణ్(6) తల్లిదండ్రుల వద్ద ఉంటూ బెంగళూరులో యూకేజీ చదువుతుండేవాడు. వేసవి సెలవులు కావడంతో తల్లి పుట్టినిల్లు అయిన తిమ్మమ్మనహళ్లిలో బాలుడి అమ్మమ్మ వద్ద వదిలి బెంగళూరుకి వెళ్లిపోయింది. బాలుడు ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో గ్రామంలోని చెరువు నుంచి మట్టిని రవాణా చేస్తున్న ఓ ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీ కొనడంతో బాలుడు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే వైఎన్.హొసకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు. ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కర్నాటక మద్యం రవాణా కేసులో నిందితులకు జైలు

**ప్రజాశక్తి-పెనుకొండ**

అక్రమంగా కర్నాటక మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఇద్దరు నిందితులకు జైలు శిక్ష విధించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందిన ఎస్.మహబూబ్ బాషా, ఎస్.బాబాఫకృద్దీన్ 2020లో కర్నాటక నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడగా అప్పటి ఎస్‌ఐ హరున్‌బాషా కేసు నమోదు చేశారు. కోర్టులో వాదనల అనంతరం బుధవారం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.బుజ్జప్ప నిందితులకు ఏడాది జైలు, రూ. 2 లక్షల జరిమానా విధించారు. దీంతో వారిని ఎస్‌ఐ అదుపులోకి తీసుకొని సబ్ జైలుకు తరలించారు. కోర్టులో ఎపిపి శ్యామల వాదనలు వినిపించారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

మండలంలోని దొరిగల్లు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి శివయ్యకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. శివయ్య కుటుంబ సభ్యులందరూ ఇంటిపై నిద్రిస్తుండగా వేకువజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**కదిరి అర్బన్ :** మండలంలోని బాలప్పగారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న చెక్ డ్యాం పక్కన పురాతన బావిలో బుధవారం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అతడి వయసు దాదాపు 40 ఏళ్ల పైన ఉంటుందన్నారు. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు చేర్చినట్లు సిఐ తెలిపారు. ఎవరైనా గుర్తుపడితే 94409 01882 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## నాటుసారా స్వాధీనం

**కదిరి అర్బన్ :** మండలంలోని బాలప్పగారిపల్లి కాలనీలో బుధవారం పోలీసులు సోదాలు చేసినట్లు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పోలీసులు పాత నేరస్తులు, నాటుసారా తయారీ, విక్రయ దారుల నివాసాల్లో సోదాలు చేసి 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారని సిఐ తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సోదాల్లో ఎస్‌ఐలు రమణారెడ్డి, రామకృష్ణ, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-కదిరి అర్బన్**

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సంఘం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయసం హరిప్రసాద్ మాట్లాడుతూ 'హరిత నేస్తం' స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పుడు చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మైనుద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ నాగేంద్రనాయక్, తాలూకా గౌరవాధ్యక్షులు ఆత్మారెడ్డి, అధ్యక్షులు ఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

# పంచాయతీ వేలాలు వాయిదా

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచి రాధా అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించారు. అయితే వేలంలో గందరగోళం నెలకొనడంతో వారపు సంత వేలం పాట నిర్వహించి బస్టాండ్, దినసరి సంత, సులభ కాంప్లెక్స్ వేలం పాట వాయిదా వేశారు. వారపు సంతకు గతంలో కంటే ఎక్కువ వేలం పాట పాడి నల్లమాడ శంకర రూ. 15,50,000కు దక్కించుకున్నారు. దినసరి సంత, బస్టాండ్, సులభ్ కాంప్లెక్స్‌లకు గిజిట్ డబ్బులు పెంచడంతో డీడీ తీసినవారు తమకు గిట్టుబాటు కాదని డిఎల్‌పిఒ కేశవరెడ్డికి తెలిపారు. దీంతో వారు చర్చించి దినసరి సంత, బస్టాండ్, సులభ్ కాంప్లెక్స్ వేలం పాటను వాయిదా వేశారు. వేలం వేసే తేదీని నిర్ణయించి త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి యుగంధర్, పంచాయితీ ఇన్‌ఛార్జి కార్యదర్శి రామ్‌గోపాల్‌రెడ్డి, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## ఎపిపిఆర్ఎస్ నమోదు చేయించుకోండి

**అగళి :** మండలంలో వ్యవసాయం చేస్తూ పట్టాదారు పాసుపుస్తకాలు కలిగి ఉన్న రైతులు వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించి ఎపిపిఆర్ఎస్ నమోదు చేసుకోవాలని ఏవో శేఖర్‌నాయక్ సూచించారు. ఆయన బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రైతు గుర్తింపు ప్రక్రియను పరిశీలించారు. రైతులు నమోదు చేసుకోకుంటే ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు దక్కవన్నారు. ఈ వారంలోగా నమోదు ప్రక్రియను రైతులు పూర్తి చేయించుకోవాల ని ఆయన తెలిపారు.

## భూ రీసర్వేపై ర్యాలీ

**గాండ్లపెంట :** మండలంలో చేపట్టనున్న రెండో విడత భూ రీసర్వేపై బుధవారం గాండ్లపెంటలో తహశీల్దార్ బి.బాబురావు ఆధ్వర్యంలో రైతులు, సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ మాట్లాడుతూ రైతుల భూమి సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే చేయిస్తుందన్నారు. రెండో విడతలో వేపరాల, గాజులవారిపల్లి పెద్దతండా, చామలగొంది గ్రామాల్లో రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అశోక చక్రవర్తి, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, వీఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వారపు సంత వేలం

**తలుపుల :** స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం అధికారులు వారపు సంతకు వేలం పాట నిర్వహించగా రూ. 6.2 లక్షలకు గంగినాయుడు దక్కించుకున్నారు. గతేడాది రూ. 3.6 లక్షలకు పాడగా ఈ ఏడాది రూ. 6.2 లక్షలకు వేలం పాడడంతో పంచాయతీకి ఆదాయం పెరిగింది. కార్యక్రమంలో ఈఓఆర్‌డి నసీమ, సెక్రటరీ అనిల్, సర్పంచి శ్రీలత, రమణ, వేలంపాటదారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఎంపిపి ఎన్నిక

**గాండ్లపెంట :** స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం జరిగే ఎంపిపి ఎన్నికలకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. ఎంపిపి ఎన్నిక నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ వలి బాషా తెలిపారు

## ఖాద్రీశుని సన్నిధిలో అన్నమయ్య వర్ధంతి

భక్తి గీతాలు ఆలపిస్తున్న భక్తులు

**కదిరి అర్బన్ :** పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బుధవారం అన్నమయ్య 522వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాండ్లపెంట కాశినాయన ఆశ్రమం నిర్వాహకులు బండి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అన్నమయ్య గొప్పతనాన్ని హరిదాసు దస్తగిరి వివరించారు. స్వామి వారి భక్తి గీతాలతో భజన చేశారు. కార్యక్రమంలో భజన బృందాల కోఆర్డినేటర్ దుర్గా, టి.నరసింహారావు భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

## నవోదయ ప్రవేశ పరీక్షలో వశిష్ట విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు**

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షల్లో స్థానిక వశిష్ట పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎ.కార్తీక్(9వ తరగతి), ఎస్.ధార్మిక(6వ తరగతి) ఉత్తీర్ణులయ్యారు. వీరిని కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో బాగా చదువుకొని మంచిస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గంగాద్రి, ఉపాధ్యాయులు నరేంద్రవర్మ, మోహన్‌రెడ్డి, సోమరాజు, పవిత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోడిపల్లిలో రీసర్వేపై గ్రామసభ

**ప్రజాశక్తి-లేపాక్షి**

మండలంలోని కోడిపల్లి గ్రామపంచాయతీలో బుధవారం రెవెన్యూ అధికారులు భూ రీసర్వేపై గ్రామసభ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ సౌజన్యలక్ష్మి మాట్లాడుతూ భూములను సర్వే చేయడం ద్వారా రైతులకు ఎలాంటి సమస్య లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి గంగాధర్, మాజీ సర్పంచి జయక్కప్పారెడ్డి, ఆయకట్టు సంఘం అధ్యక్షులు హరిజయరాం, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపల్లిలో ర్యాలీ చేపట్టిన రెవెన్యూ అధికారులు

## వికలాంగుల చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి-మడకశిర**

పట్టణంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం వికలాంగుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించారు. దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బుచ్చయ్య శిక్షణ ఇచ్చారు. హిందూపురం సూపర్ వైజర్స్ శ్రీలక్ష్మి, మంజుల, 47 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపి సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

**ప్రజాశక్తి-మడకశిర**

మండలంలోని కె.గుండుమల గ్రామంలో బుధవారం టిడిపి నాయకులు పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రప్ప, జీయర్ రంగనాథ్, దొరస్వామి, రాధా రమణ, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# మూల్యాంకనం కేంద్రాల్లో వసతులు కల్పించాలి

### వైఎస్ఆర్ టిఎ జిల్లా అధ్యక్షులు పివి.రమణారెడ్డి

**ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్**

త్వరలో పదో తరగతి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమవుతున్న దృష్ట్యా జిల్లాలో మూల్యాంకన కేంద్రాల్లో తగిన వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం వైఎస్ఆర్ టిఎ జిల్లా అధ్యక్షులు పివి.రమణారెడ్డి ఆధ్వర్యంలో డిఇఒ జి.కృష్ణప్పను వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మూల్యాంకనం కేంద్రాల్లో ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, లైటింగ్, ఫ్యాన్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. 58 ఏళ్ల పైబడిన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులను మూల్యాంకనం విధుల నుంచి మినహాయించాలని కోరారు. దగ్గర ప్రాంతాల ఉపాధ్యాయులను నియమించాలన్నారు.

## నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలి

### సిఎస్‌డిటి శారద

**ప్రజాశక్తి-తాడిమర్రి**

మండలంలోని రేషన్‌కార్డుదారులు ఈ నెల 30వ తేదీలోగా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సిఎస్‌డిటి శారద తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ పెండింగ్ ఉన్న వారి లిస్టు సంబంధిత స్టోర్ డీలర్ వద్ద ఉందని, వెంటనే కార్డుదారులు వారిని సంప్రదించి వేలిముద్ర వేసి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. లేనిచో వచ్చే నెల నుంచి బియ్యం కార్డు నుంచి వారి పేరు తొలగిస్తారన్నారు.

## మైనారిటీ రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

రుణాల కోసం మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని ఎపి స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు సుబ్రహ్మణ్యం బుధవారం ఓ ప్రకటనలో తెలి పారు. ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, బౌద్ధులు, పారిశీకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో సబ్సిడీ రుణం పొందని వారు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 98499 01188 లో సంప్రదించాలన్నారు.

## వార్షిక రుణ, జీవనోపాధులపై శిక్షణ

**ప్రజాశక్తి బత్తలపల్లి**

స్థానిక ఆర్కె ఫంక్షన్ హాల్‌లో బుధవారం స్వయం సహాయక సంఘ సభ్యుల వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక 2025-26పై 16 మండలాల డిఆర్‌డిఏ వెలుగు ఏపిఎం, సిసిలకు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. డిఆర్‌డిఏ పిడి నరసయ్య ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఐబి యాంకర్ పర్సన్ ఓబిలేసు, ఏరియా కోర్డినేటర్ డిపిఎం సత్యనారాయణ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో మండల సమాఖ్య కార్యదర్శి కళావతి, కదిరి ఏరియా కోర్డినేటర్ వెంకటనారాయణ, ఓడిచెరువు ఏపి రవీంద్ర, బ్యాంక్ లింకేజీ యాంకర్ పర్సన్ రాజశేఖర్, రమణప్ప, 16 మండలాల ఏపిఎంలు, ఎల్‌సిలు, సిసిలు పాల్గొన్నారు.

## ఈకేవైసీ గడువు పొడిగించాలని వినతి

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవడానికి ప్రభుత్వం మరో నెల రోజులు గడువును పొడిగించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సాయి గీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తిప్పయ్య, దాబా రామకృష్ణ, గంగిరెడ్డిపల్లి నాయుడు, వెంకటరాముడు, ఈశ్వరనాయక్, ఆటో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సంతేబిదనూరులో కార్డెన్ సెర్చ్

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం రూరల్ మండలం సంతేబిదనూరు రూరల్ అప్ గ్రేడ్ పోలీసు స్టేషన్ సిఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ద్విచక్రవాహనాల రికార్డులను పరిశీలించి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల గురించి, వాహన చట్టాల గురించి, మహిళలపై జరుగుతున్న నేరాల గురించి, శక్తి యాప్ ప్రాముఖ్యత తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం, ఎస్ఐలు ముని ప్రతాప్, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ యువతకు సూచనలు ఇస్తున్న సిఐ ఆంజనేయులు